

పోక్సో కేసులో..నిందితుని రోడ్డుపై నడిపిస్తూ...

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: బాలికకు మాయ మాటలు చెప్పి లోబరుచుకుని, మూడు సంవత్సరాలుగా సహజీవనం సాగించిన నిందితుని ఈస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... నిందితుడు చెన్నంపల్లి జలపతి రెడ్డి ఓ ప్రైవేటు స్కూల్లో సోషల్ టీచరుగా పనిచేస్తున్నాడు. తన వద్ద చదువుకుంటున్న బాలికను మాయ మాటలు చెప్పి లోబరుచుకొని, గత మూడు సంవత్సరాలుగా రిలేషన్షిప్ కొనసాగిస్తున్నాడు. కూతురు తీరు పై మార్పును గమనించిన తల్లిదండ్రులు నిలదీయడంతో అసలు విషయం చెప్పింది. దీంతో ఖంగుతున్న తల్లిదండ్రులు తమ బిడ్డకు న్యాయం చేయాలను కోరుతూ ఈస్ట్ పోలీసులను ఆశ్రయించారు. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో విచారణ చేపట్టి, మంగళవారం నిందితుని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ కోసం కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా ఈస్ట్ పోలీసు నుంచి కొంత దూరం నిందితుని రోడ్డుపై నడుచుకుంటూ తీసుకెళ్లారు. న్యాయమూర్తి ఆదేశాలతో నిందితున్ని తిరుపతి సబ్ జైలుకు తరలించారు.

జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి

చిత్తూరును క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం: శాప్ చైర్మన్



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న శాప్ చైర్మన్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనాత్మక శక్తి పెంపొందుతుందని, జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర క్రీడ సాధికార సంస్థ చైర్మన్ అమినేని రవి నాయుడు తెలిపారు. మంగళవారం జిల్లా ప్రాధికార సంస్థను ఆయన సందర్శించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, తుడా చైర్మన్ కటారి హేమలత ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవి నాయుడు మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడా అభివృద్ధికి అత్యధిక ప్రాముఖ్యత ఇస్తున్నారని నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాల్లో బాలికలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తామని తెలిపారు. కళాశాలలు పాఠశాలలు యూనివర్సిటీల సమన్వయంతో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దీనికి కావాల్సిన కోర్సులను నియమించి క్రీడాకారులకు పూర్తిస్థాయి ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా డిఎస్డివో బాలాజీ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధికి రూ.2.50 కోట్లు ప్రతిపాదన అందించగా, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల విడుదలకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నగరంలోని మెసానిక్ మైదానంలోని ఇండోర్ స్టేడియం, లక్ష్మీ నగర్ కాలనీలోని శిథిలమైన ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు మెరుగైన వసతుల కల్పన, మెసానిక్ మైదానానికి అవసరమైన మరమ్మతులు చేపట్టడంపై అధికారులతో చర్చించి పూర్తిస్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇండోర్ స్టేడియంలో పూర్తిస్థాయి మరమ్మతులు, వసతుల కల్పనకు ఇప్పటికే రూ.3కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసినట్లు వివరించారు. క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో స్పోర్ట్స్ కోటా కింద డైరెక్ట్ రిక్రూట్మెంట్ చేస్తున్నట్లు వివరించారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లోనూ క్రీడాకారులకు పోస్టింగ్స్ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 18రకాల క్రీడల్లో విద్యార్థులు రాణిస్తున్నారని వీరికి మరింత శిక్షణ ఇచ్చి, మెరుగైన ప్రతిభ కనబరిచేలా కృషి చేస్తామన్నారు. కోచ్‌లు కొరత అధికమించేందుకు ఇప్పటికే జిల్లాకు ఒక కోచ్‌ను నియమించామని, త్వరలో మరో 108మంది కోచ్‌ల నియామకానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అనంతరం లక్ష్మీ నగర్ కాలనీలోని శిథిలావస్థలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. కూలిపోయే స్థితిలో ఉన్న స్టేడియాన్ని తొలగించి, కొత్త ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శాప్ చైర్మన్‌ను కోరారు. మెసానిక్ మైదానంలో జిల్లా అండర్-19 ఖో-ఖో టీంను అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఎమ్మెల్యే క్రీడా పరికరాలతో కూడిన కిట్లను బహుకరించారు. మేయర్ ఎస్.అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్.రాజసింహులు, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, చిత్తూరు పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు సీఆర్ రాజన్, డీఎస్డీవో బాలాజీ, నాయకులు చంద్రప్రకాష్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ఎంఎస్ఎంఈ పార్కుల లక్ష్యం

జనవరి నాటికి మరో 70 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తాం: సిఎం



వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సిఎం


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ తెలిపారు. చిత్తూరు రూరల్ మండలం, వెంకటాపురం వద్ద పరిశ్రమలు-ఉపాధి కల్పన పేరుతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్ఈ- సిడిపిలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో విశాఖపట్నం నుంచి భూమిపూజ చేశారు. నియోజకవర్గం పరిధిలోని చిత్తూరు రూరల్ మండలం 5-వెంకటాపురంలో పరిశ్రమలు -ఉపాధి కల్పన పేరుతో ఎంఎస్ఈ- సిడిపిలను ప్రారంభించడం అభినందనీయమని ఎంపీ తెలిపారు. దీని వల్ల నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడో ఇండస్ట్రీ పార్కులకు కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. చిత్తూరు మండలం 5. వెంకటాపురంలో 68 ఎకరాల్లో విస్తీర్ణంలో రూ.14.30 కోట్లతో జిల్లాలో అతిపెద్ద ఇండస్ట్రియల్ పార్క్, అలాగే పుంగనూరులో చదల గ్రామంలో రూ.9.50 కోట్ల వయ్యంతో 21.80 ఎకరాలలో పార్కు, నగిరి మండలంలో మాంగాడు గ్రామంలో రూ.17.30 కోట్ల వయ్యంతో 20 ఎకరాలలో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్కులకు, కుప్పంలో పల్లార్లపల్లి వద్ద రూ.206.16లక్షలతో ఎఫ్ఎఫ్‌సికి శంకుస్థాపనలు ఆయా నియోజకవర్గంలో వర్చువల్ విధానం ద్వారా చేయుచున్నామని వివరించారు. కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి నాయుడు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, మేయర్ అముద, చుడా ఛైర్పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టిడిపి పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ మురళీమోహన్, టిడిపి చిత్తూరు పార్లమెంటు జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ పాల్గొన్నాను.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి, కలెక్టర్

చెరుకువారిపల్లి వాటర్ షెడ్ ప్రాజెక్టుకు అవార్డు

ప్రోత్సాహకంగా రూ.20లక్షలు మంజూరు



కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న పీడీ రవికుమార్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): నేషనల్ లెవెల్ కాన్ఫరెన్స్ జన్ భాగిదారి కప్ కాంపిటీషన్‌లో చిత్తూరు జిల్లా సదుం మండలం చెరుకువారిపల్లి ప్రాజెక్టుకు రాష్ట్రంలో మొదటి స్థానం సాధించి అవార్డుకు ఎంపికైంది. పిఎంకెఎస్‌వై 2.0 డబ్ల్యుసిసి సదుం, చెరుకువారిపల్లి వాటర్ షెడ్ ప్రాజెక్టు అభివృద్ధి పనులలో భాగంగా 211 చేపట్టగా రూ.3కోట్ల 28 లక్షలు ఖర్చు చేయడం జరిగింది. ఇందులో భాగంగా డైరెక్ట్‌గా, ఇండైరెక్ట్‌గా 617మంది రైతులకు లబ్ధి పొందే విధంగా పనులు చేపట్టడంతో రాష్టంలో మొదటిస్థానం సాధించింది. ఇందకు గాను మంగళవారం గుంటూరు లోయలా పబ్లిక్ స్కూలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, పెమ్మసాని చంద్రశేఖర్ చేతులు మీదుగా చిత్తూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఏ.రవికుమార్, పథక అధికారి ఏ.శోభారాణి అందుకోవడం జరిగింది. అలాగే చెరుకువారిపల్లి ప్రాజెక్టుకు రూ.20 లక్షలు అదనపు నిధులు మంజూరు చేస్తూ చెక్కును అందించడం జరిగింది. ఈ నిధులు సహజవనరుల యాజమాన్యం కింద ఉపయోగించుకోవాలని కేంద్ర మంత్రి తెలిపారు.

సంజీవని డిజిటల్ నర్వ్ సిస్టంపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సంజీవని ప్రాజెక్ట్ ద్వారా ప్రతి పౌరునికి ఆరోగ్యాన్ని సులభంగా క్వాలిటీగా ఇవ్వాలన్నదే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో 28 మండలాల సంబంధించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల మెడికల్ ఆఫీసర్లతో ఒక రోజు వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో లాంచ్ చేసే సంజీవనీ డిజిటల్ నర్వ్ సిస్టంపై శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యక్తుల ఆరోగ్యాన్ని డిజిటల్ రికార్డులుగా మార్చటంతో పాటు వైద్యసేవలు అందించేలా త్వరలో జిల్లా అంతట సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ వైద్య రంగంలో ఓ గేమ్ ఛేంజర్ అన్నారు. కుప్పం డిజిటల్ నెర్వ్ సెంటర్ మంచి ఫలితాలు వస్తున్నాయని, ప్రతి పేషెంట్‌కు రిజిస్ట్రేషన్ మొబైల్ నెంబర్ ద్వారా, అబా ఐడి క్రియేట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రతి డాక్టరు ఛాలెంజ్‌గా తీసుకొని జిల్లాలోని ప్రజలందరికీ సేవలు జరిగేలా చూడాలని తెలిపారు. డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా వైద్యరంగంలో అత్యుత్తమ సాంకేతికతను కూడా సమన్వయం చేయడం జరుగుతుందని తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని కూడా దీనికి అనుసంధానిస్తామన్నారు. అనంతరం పవర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో టాటా కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవి, డాక్టర్ సరస్వతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, డిసిహెచ్ ఎస్‌డాక్టర్ పద్మాంజలి, తిరుపతి డిఎంహెచ్వో డాక్టర్ బాలకృష్ణ నాయక్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కల్తీ నెయ్యి దోషులను వదిలే ప్రసక్తే లేదు

రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డును కల్తీ చేసిన దోషులను వదిలే ప్రసక్తే లేదని రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవి సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలుగుదేశంపై విమర్శలు గుప్పిస్తూ ఎలాంటి కల్తీ జరగలేదని బుకాయించిన విషయాన్ని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తున్న నెయ్యి కల్తీని గుర్తించి భక్తుల మనోభావాలను దెబ్బతినకుండా కాపాడమన్నారు. నెయ్యి కల్తీ విచారంలో బోలె బాబా కంపెనీ సరఫరా చేసిన నెయ్యి కల్తీ నెయ్యిని గుర్తించడం జరిగిందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి కల్తీ నెయ్యి విషయంలో చోటు చేసుకున్న అక్రమాలపై వివరణ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్మన్ కటారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, చంద్రప్రకాష్, మోహన్ రాజ్ పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

విస్తృతంగా తనిఖీలు



చిత్తూరు రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఢిల్లీ నగరంలో మంగళవారం జరిగిన దాడుల నేపథ్యంలో చిత్తూరు జిల్లా పోలీసుశాఖ అప్రమత్తమైంది. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా అంతటా అన్ని ముఖ్యమైన రహదారులు, చెక్ పోస్టులు, రైల్వేస్టేషన్లు, బస్ స్టాండ్లు, పట్టణ ప్రవేశ ద్వారాల వద్ద విస్తృత స్థాయిలో వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా పోలీసులు ప్రతి వాహనాన్ని సవివరంగా తనిఖీ చేసి, వాహన యజమానుల గుర్తింపు పత్రాలు, లగేజీ, నంబర్ ప్లేట్ వివరాలు వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. అనుమానాస్పదంగా కనిపించే వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ తనిఖీలలో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో రైల్వే స్టేషన్‌లో, ప్రతి వాహనంలో లగేజీ స్కానింగ్ పరికరాల సాయంతో తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ఆర్‌టిసి బస్సులు, ఆటోలు, ట్రావెల్స్ వాహనాలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోంది. పోలీసులు రాత్రివేళల్లో హైవేలపై పహారా బలోపేతం చేసి, ప్రతి వాహనం రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఏఎన్‌పిఆర్ కెమెరాల ద్వారా కూడా పరిశీలిస్తున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న లాడ్జీలు, హోటళ్లలో సైతం పోలీసులు తనిఖీ చేసి, అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తుల వివరాలను పరిశీలించారు. తమ పరిసరాలలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా వస్తువులు గమనించిన పక్షంలో వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు, డయల్ 112 లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9440900005కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ కోరారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం: డిఆర్‌ఓ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని డిఆర్‌ఓ కె.మోహన్‌కుమార్ తెలిపారు. మంగళవారం అబుల్ కలాం ఆజాద్ 138వ జన్మదినోత్సవ సందర్భంగా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం హాల్‌లో భారత రత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అలాగే మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిత్తూరు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో విద్యామేధావి, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యామంత్రిగా గుర్తింపు పొందిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన ఆలోచనలు, కృషి, త్యాగం మనందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అలాగే వైసీపీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసి.విజయానందరెడ్డి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించారు.

కేఈసీలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

కుప్పం: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజును జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని దేశం ఎన్నటికీ మర్చిపోదని బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ నాగరాజ్ పేర్కొన్నారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు ఘటించారు. వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, ఆర్‌డి డైరెక్టర్ డాక్టర్ కోదండరామయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాధవన్, కోఆర్డినేటర్ గంగాధరన్, పిఆర్‌ఓ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



కుప్పంకు క్యూ కడుతున్న పరిశ్రమలు

ఎఫ్‌ఎఫ్‌సి ఏర్పాటుకు సీఎం శంకుస్థాపన ...త్వరలో మరో ఎనిమిది పరిశ్రమలు



ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు. నాలుగు రోజుల క్రితం కుప్పంలో సుమారు రూ.2200 కోట్లతో 7 పరిశ్రమలు ఏర్పాటుకు సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయగా మంగళవారం ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సి) ఏర్పాటుకు సీఎం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. కుప్పం మండలం పలార్లపల్లి సమీపంలో 18.5 ఎకరాల్లో రూ.15.66 కోట్ల పెట్టుబడితో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటు కానుంది. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎం పార్కులో ఏర్పాటుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కుప్పం నియోజకవర్గంలోని ప్రతి మండలంలోనూ ఎంఎస్ఎం పార్కులను ఏర్పాటు చేయనున్నారు. కాగా, మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ఎఫ్ఎఫ్‌సి ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కుప్పంలో పరిశ్రమలు ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తుందని అదేవిధంగా కుప్పం ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. త్వరలోనే కుప్పం నియోజకవర్గంలో మరో 8 పరిశ్రమలు ఏర్పాటు కానుందని ఇది వరకే సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారని మొత్తంగా కుప్పం ప్రాంతం పారిశ్రామిక ప్రగతిని సంతరించుకుంటుందని ఆనందం వ్యక్తం చేశారు. కుప్పంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు మక్కువ చూపుతున్నారని ఇకపై కుప్పం ప్రాంత నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఆవశ్యకత ఉండదన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్. మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, ఏపీ ఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఆర్డిఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ అధ్యక్షులు కానిపాకం వెంకటేష్, ఏరియా హాస్పిటల్ వైస్ ఛైర్మన్ భాగ్యలక్ష్మి, డీఎస్పీ పార్థసారథి, బెస్తా కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగల్, రెస్కో డైరెక్టర్ తులసి, ఆర్ముగం, శివ, అనసూయ, ఎంఆర్‌ఓ చిట్టిబాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలి

స్త్రీ శక్తిని చాటాలి: ఎంపి, ఎమ్మెల్యే



మహిళలకు చెక్కులు అందిస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- తవణంపల్లి: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని, దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, స్త్రీ శక్తిని చాటాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళి మోహన్ ఆకాంక్షించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ -వెలుగు, ఎమ్మెల్యే నేతృత్వంలో మంగళవారం తవణంపల్లిలో నిర్వహించిన తెలుగు మహిళా మార్ట్ లాభాలు - బ్యాంకు రుణాల పంపిణీ కార్యక్రమానికి ఎంపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి మహిళలతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలు పాలాభిషేకం చేశారు. అనంతరం శ్రీశక్తి పథకం కింద మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు డ్వాక్రా మహిళలకు గ్రామీణాభివృద్ధి సంస్థ -వెలుగు ద్వారా అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సీఎం చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. స్త్రీలు సమాజంలో జీవన జ్యోతిని వెలిగించి, స్త్రీ శక్తిని చాటాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ -వెలుగు అధికారిణి శ్రీదేవి, మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, క్లస్టర్ ఇంచార్జిలు ప్రవీణ్ నాయుడు, మోహన్ నాయుడు, నాయకులు రంజిత్ రెడ్డి, గోపి, ప్రకాష్, భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

దళవాయి చెరువు తూము వద్ద

తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు



యంత్రాల సాయంతో తాత్కాలిక మట్టి రోడ్డు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పొదలకుంటపల్లి పంచాయతీ తుగడంవారిపల్లె సమీపంలో నంజంపేటకు వెళ్లే మార్గంలో దళవాయి చెరువు కట్ట తూము వద్ద గండి పడి కట్ట కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గత ఏడాది, ఈ ఏడాది రెండుసార్లు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు పూర్తిగా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో విద్యార్థులు, ప్రజలు, మహిళలు నంజంపేటకు రావడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత వెడల్పుగా కట్ట కొట్టుకుపోవడంతో గత 20 రోజులుగా పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. మండల జనసేన నాయకులు స్వచ్ఛందంగా యంత్రాలతో మంగళవారం పెద్దపెద్ద పైపులను ఏర్పాటు చేసి వాటిపై మట్టి ఇసుక పోసి తాత్కాలిక మట్టి రోడ్డును సిద్ధం చేశారు. దీంతో మంగళవారం నాలుగు గంటల నుండి ద్విచక్ర వాహనాలు పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజల సమస్యలను గుర్తించి తాత్కాలిక మట్టి రోడ్డును ఏర్పాటు చేయడంపై ఈ ప్రాంత ప్రజలు జనసేన నాయకులను అభినందించారు. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు నాగభూషణం, ఉపాధ్యక్షులు చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శి పవన్, ఏఎంసీ డైరెక్టర్ మురళి, కదిరప్ప, శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయంలో ఛైర్మన్ తనిఖీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఢిల్లీ ఘటన నేపథ్యంలో భద్రతా సిబ్బందితో కలిసి పలుచోట్ల పర్యటించారు. అనుకోని ప్రమాదం జరిగితే తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భక్తులకు భరోసా ఇచ్చేలా భద్రతా చర్యలు ఉండాలని సూచించారు. అనంతరం పలు దుకాణాలను తనిఖీ చేసి భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యాపారాలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కూలీలకు ఉపాధి కరువు

- ఆధునిక యంత్రాలతో సేద్యం
- కాడి ఎద్దులు, నాగలి పట్టేవారు కనుమరుగు
- పనుల కోసం వ్యవసాయ కూలీల వెతుకులాట

ప్రజాశక్తి -వెదురుకుప్పం: నాగరికత పుట్టినప్పటి నుంచి సంప్రదాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ రైతు కుటుంబాలు ఇతర కుటుంబాలకు ఉపాధి కల్పించి అనుసంధానంగా జీవించేవారు. అయితే ఆధునిక ట్రాక్టరు, యంత్రాల రాకతో కొనసాగుతున్న సేద్యంతో కూలీలకు పనులు లభించక వెతుకులాట ప్రారంభించి దూరంగా పట్టణాలకు, పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లి పడరాని పాట్లు పడుతున్నారు. ఒకప్పుడు వ్యవసాయ కుటుంబాల ఇళ్ల వద్ద, పొలాల్లో కాడి ఎద్దులు కనిపించేవి.. ఇప్పుడు అవి కనుమరుగయ్యాయి. ఇటు పొలాల్లో వరి నాట్లు వేసేందుకు, వేరు శనగ విత్తనాలు విత్తేందుకు ఆధునిక యంత్రాలు రావడంతో కూలీలకు పూర్తిగా ఉపాధి కరువై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ సుదూర ప్రాంతాల బాట పట్టి చాలీ చాలని డబ్బులు, పనులు దొరక్క పస్తులతో కాలం గడపాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీలకు పనులు కరువు

వరి పంటకు ఒక ఎకరాకు గతంలో నాట్లు వేసేందుకు, కోతకు 30 మంది కూలీలకు పనులు లభించేవి. వారికి రోజుకు 500 రూపాయలు లభించేది. ప్రస్తుతం అన్ని యంత్రాలు రావడంతో కూలీలకు పనులు లభించడంలేదు. వేరుశనగ విత్తనాలు విత్తేందుకు ఎకరాకు 30 మంది కూలీలకు పని దొరికి రోజుకు 300 రూపాయలు లభించేది. ఇప్పుడు యంత్రాలు వచ్చి పనులు కరువయ్యాయి. కొబ్బరి చెట్లు ఎక్కి కాయలు కోసేందుకు ఒక్కో చెట్టుకు వంద రూపాయలు కూలీ దొరికేది. ఇప్పుడు యంత్రాలు రావడంతో కూలీలను పిలిచే వారే కనిపించడంలేదు. మామిడి తోటలకు గుంతలు తవ్వి నీటినిపట్టేందుకు గట్టు తవ్వేందుకు గతంలో ఎకరాకు పది మంది కూలీలకు పని దొరికేది. తర్వాత మామిడి చెట్టు కత్తిరింపులకు కూలీలను పిలిచి రోజుకు 500 వందల రూపాయలు కూలీ ఇచ్చేవారు. ప్రస్తుతం ఆధునిక ట్రాక్టర్లు, యంత్రాల రాకతో కూలీలకు పనులు కరువయ్యాయి.

కాడి, నాగలి పట్టే కూలీలను పిలిచేవారు లేరు..

గతంలో వరి పైరు దున్నేందుకు ఉపయోగించే కాడి ఎద్దులు, నాగలి ఉపయోగించే వారు. ఈ పనులు చేసే వారికి రోజుకు 500 రూపాయలు ఇచ్చేవారు. ఆధునిక యంత్రాలతో ఇప్పుడు కాడి ఎద్దులు, నాగలి పట్టి దున్నే వారిని పిలిచేవారే కనిపించడంలేదు. దీంతో కూలీలు ఉపాధి కోసం వలస బాట పట్టారు.


ఒకప్పటి కాడెద్దుల వ్యవసాయం (ఫైల్ ఫొటో)

ఉపాధి కోసం రైతు కుటుంబాలు వెతుకులాట

వెదురుకుప్పం మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉన్నాయి. 222 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వ్యవసాయ పనులపై ఆధారపడి జీవించే వారు వందల సంఖ్యలో వున్నారు. ప్రస్తుతం ఆధునిక యంత్రాల రాకతో కూలీలు పనులు దొరక్క తిరుపతి, చిత్తూరు, పక్క రాష్ట్రమైన హైదరాబాదు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళుతున్నారు. గ్రామాలలో ముసలివారు, ఏదో ఒకటి రెండు కుటుంబాల వారు మాత్రమే వ్యవసాయ పనులు చూసుకుంటూ ఇంటిదగ్గర కాపలా ఉన్నారు. మిగిలిన వారు పట్టణాలకు ఉపాధికి వెళుతున్నట్లు చెబుతున్నారు. చిన్న చిన్న పనులు దొరక్క పట్టణాలలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అక్కడికి వెళ్లిన కుటుంబాల వారు పేర్కొంటున్నారు. రెస్టారెంట్లు, లాడ్జీలకు వెళ్లి, హోటళ్లలో, పెద్ద అపార్టు మెంట్లలో పాచిపని, పారిశుధ్యం పనులకు వెళుతున్నారని కూలీలు వాపోతున్నారు. మళ్లీ సొంత ఊరుకు వస్తే ఎలాంటి పనులు దొరక్క పస్తులు వుండా ల్సి వస్తోందని వ్యవసాయ కూలీలు వాపోతున్నారు. ప్రభుత్వా లు స్పందించి పల్లెల్లోనే జీవనోపాధికి ప్రభుత్వాలు ప్రణాళికలు రూపొందించి ఉపాధి చూపాలని వ్యవసాయ కూలీలు కోరు తున్నారు.

పనులు దొరకడం కష్టతరం



నేను బెంగుళూరులో పెద్దపెద్ద భవనాలలో వాటర్ క్యూరింగ్ పనులు చేస్తున్నాను.. గతంలో పనులు బాగా దొరికేవి.. ఇప్పుడు పోటీ పెరిగింది.. పనులు దొరకడంలేదు.. తగిన కూలీ లభించడం లేదు.. సొంత ఊరికి వస్తే వ్యవసాయ పనులు లేవు.. కుటుంబాన్ని పోషించడం ఎలాగో తెలియడం లేదు..

- బోడిరెడ్డి దశరథరెడ్డి, చిన్న పోటుచేను, వెదురుకుప్పం మండలం.

ఏ పని దొరికినా వెళుతున్నా..



నేను బెంగుళూరులో ఏ కూలి పని దొరికినా వెళుతున్నా.. రోజుకు ఆరు, ఏడు వందల రూపాయలు మాత్రమే వస్తోంది.. దీంతో అక్కడ బతకడం కష్టంగా మారింది.. సొంత ఊరికి వస్తే వ్యవసాయ పనులు తప్ప మరో మార్గం లేదు.. ఇవి ఇక్కడ దొరకడం లేదు.. కుటుంబ జీవనం గడవడం కష్టంగా వుంది.. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు..

- పూల సుధాకర్, చిన్న పోటుచేను, వెదురుకుప్పం మండలం.

అవమానాలు భరిస్తున్నాం..!

- నా భర్త వైసిపికి పునాదులు వేశారు..
- నల్లవెంగనపల్లె ఎంపిటిసి సుజాత ఆవేదన



ప్రజాశక్తి -వెదురుకుప్పం: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి వైసిపిని ఏర్పాటుచేసిన ఆవిర్భావం నాటి నుంచి ఆ పార్టీ బలో పేతానికి కృషి చేసిన తన భర్త పేట ధనంజయులురెడ్డికి తీవ్ర అవమానం జరుగుతోందని నల్లవెంగనపల్లె ఎంపిటిసి సుజాత మంగళవారం మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే హోదాలో నారాయణ స్వామి ఒకసారి తన భర్తను పార్టీ నుంచి బహిష్కరణకు గురి చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం సమన్వయకర్త కృపాలక్ష్మి హయాంలో మళ్లీ నిష్కారణంగా బహిష్కరణకు గురి చేశారని ఆరోపించారు. 'కారణాలు లేకుండా పార్టీకి కష్టపడ్డ నాయకుడికి ఇదేనా మీరిచ్చే బహుమానం?' అంటూ ప్రశ్నించారు. తాను రెండు రోజుల్లో ఎంపిటీసీ పదవికి రాజీనామా చేస్తానని తెలిపారు. మరో ముగ్గురు ఎంపిటీసీలు రాజీనామా చేస్తామని తనతో టచ్‌లో ఉన్నారని వెల్లడించారు.

హేమావతికి పరామర్శ

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరులో ఆదివారం ముసలిమడుగులో పవన్ పర్యటించిన రోజు తొక్కిసలాటలో గాయపడిన హేమావతిని జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ పరామర్శించారు. పలమనేరు పర్యటన సందర్భంగా తోపులాటలో గాయపడ్డ హేమావతి కోసం పవన్ ప్రత్యేక బహుమతిని పంపించారు. ఘటన గురించి తెలుసుకున్న ఆయన మంగళగిరి నుంచి ప్రత్యేకంగా కొండపల్లి బొమ్మలను జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ వద్ద పంపించారు. ఆమె తొందరగా కోలుకోవాలని కోరుకుంటూ ఉత్తరాన్ని సైతం పంపారు. దీంతో హేమావతి సంతోషం వ్యక్తం చేసింది. విషయం తెలుసుకున్న వెంటనే పవన్ తనను అప్రమత్తం చేశాడని, అందుకే వచ్చా నన్నారు. ఆమెకు వెంటనే వితంతు పింఛను వచ్చేలా ఏర్పాటు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

గృహ నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ పాయలగుట్ట ఎస్టీ కాలనీలో హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో సి వి ఎస్ వి ప్రసాద్ హౌసింగ్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. ఇటీవల కలెక్టర్ పాయలగుట్టను సందర్శించి ఇండ్లు దుస్థితికి చేరాయని నూతన ఇండ్లు నిర్మించుకునేందుకు ఒక్కో కుటుంబానికి ఒక లక్ష 50 వేల రూపాయల నిధులను మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారని కాంట్రాక్టర్ ప్రమేయం లేకుండా హౌసింగ్ సిబ్బంది ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని కోరడంతో గత 15 రోజులుగా హౌసింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలను చేస్తూ ఉండడంతో ఎంపీడీవో వెళ్లి పరిశీలించి మరిన్ని సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మణికంఠ , సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ కమిటీ ఏర్పాటు

చైర్మన్‌గా బిఎంకె రవిచంద్రబాబు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయ పాలక మండలిని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 12 మంది సభ్యులతో నూతన కమిటీని నియమించింది. గంగమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్‌గా టిడిపి సీనియర్ నేత బిఎంకె రవిచంద్రబాబు, బోర్డు సభ్యులుగా సంతోషమ్మ జయరాం నాయుడు, వినాయకన్, మహేష్, శారదమ్మ కంద స్వామి, రాజ్ కుమార్, నరేష్, వెన్నెల శరవణ, మంజులా దేవి మణి, వి ఎస్ లక్ష్మి ఆనంద కృష్ణమూర్తి, జ్యోతిష్, ఆలయ ప్రధాన పూజారి సోమశేఖర్ శాస్త్రీయలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు నూతన కమిటీ కొనసాగనుంది.



పాఠశాల ఆవరణలో నీటి తొట్టె మూసివేత

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి -వి కోట : పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న నీటి తొట్టి విషయంగా ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రమైన వి కోటలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి గతంలో గుత్తేదారు నీటి తొట్టిని నిర్మించి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తొట్టె నిండి అందులోని చెత్త ఇతర వ్యర్థాలతో నీరు కలుషితమై ప్రమాదకరంగా మారింది. పాఠశాల ఆవరణలోనే బాలుర వసతి గృహం కూడా ఉండడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్న విషయం ప్రచురితమైంది. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుం-ాలు స్పందించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి ప్రమాద కరంగా ఉన్న నీటితొట్టిని మట్టితో మూసివేశారు. సత్వరం స్పందించి చర్యలు చేపట్టిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఇతర ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజలు అభినందించారు.

పారదర్శకంగా ఉండాలి

పాఠశాల పనితీరుపై ఏపీఎస్ఎస్ ఏఏటి కార్యకర్త పంచరత్నం ఆదేశం


మాట్లాడుతున్న పంచరత్నం

ప్రజాశక్తి -బంగారు పాలెం: పాఠశాల పని తీరు పారదర్శకంగా ఉండాలని ఏపీ ఎస్ఎస్ ఏఏటీ కార్యకర్త పంచ రత్నం అన్నారు. మంగళ వారం మండలంలోని వెలుతురు చేను ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు విద్యార్థులు తల్లిదండ్రులు తరచూ సందర్శిం చాలని తద్వారా పాఠశాలకు మంజూరయ్యే నిధుల గురించి తెలుసుకొని పాఠశాల అభివృద్ధికి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు 2 రమేష్ బాబు, ప్రధానోపా ధ్యాయులు సంధ్యా, సిఆర్‌పి విలువనాథ్, ఎస్ఎంసి చైర్మన్ శేఖర్, పలువురు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ప్రజాశక్తి -చౌడేపల్లి: స్వాతంత్ర సమరయోధుడు భారతావని మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ జయప్రకాష్ అధ్యక్షతన జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు విద్యార్థులకు ఆయన చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు ఎస్‌విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు నందీశ్వరయ్య, ఐక్యుఎసి కోఆర్డినేటర్, బెనజిర్, షెఫివుల్లా, నిజాముద్దీన్, నూరుల్ల ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సోమల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్ అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు

మున్సిపల్ కాంప్లెక్స్ అడ్డా

కమిషనర్‌కు వ్యాపారుల ఫిర్యాదు

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు వైఎస్ఆర్ మున్సిపల్ కాంప్లెక్స్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని వ్యాపారులు వాపోయారు. బస్టాండ్ పక్కనే ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లో బయట వ్యక్తులు ఇష్టం వచ్చినట్లు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని మందుబాబులు నిత్యం మద్యం తాగుతూ నానా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. గదులు సైతం ఉరుస్తున్నాయని, రిపేర్లు చేయాలని మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కు మంగళవారం వినతిపత్రం అందించారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురంమండలం లోనీ కన్నికాపురం గ్రామానికి చెందిన వడ్లపట్ల శ్యామలా దేవి మంగళవారం రాత్రి స్వగ్రామం గంగమ్మ గుడి లో మృతి చెందారు. ఉపాధ్యాయురాలుగా పేద విద్యార్థులకు విద్య కోసం పలు సేవలు అందించిన ఈమె అనురాధ అను కలం పేరుతో పలు కవితలు రాశారు. స్పందన ఫౌండేషన్ సంస్థతో పేద విద్యార్థులకు తమ వంతు సాయం అందించారు. ఈమె కవితల్లో అమ్మకు వందనం, జీవిత సత్యాలు, జీవన సౌరభాలు ప్రాచుర్యం పొందాయి. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.




రక్త పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవతో చేపడుతున్న రక్త పరీక్షల శిబిరంలో అందరూ రక్తపరీక్షలు చేయించుకోవాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం పట్టణంలో నిర్వహిస్తున్న రక్త పరీక్షలు శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. భవ్య హెల్త్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ టెస్ట్ తెలుపుతారని ఒక్కసారి రక్తపరీక్ష చేయించుకుంటే 49 రిపోర్ట్స్ ఇస్తారన్నారు. కుప్పం నియోజకవర్గంలో 90 వేల మందికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

గిరిజనులకు ఉచిత వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి, పలమనేరు రూరల్ (గంగవరం): బైరెడ్డిపల్లి మండలంలోని దొడ్డిపల్లి (సెంటర్) యానాది కాలనీలో, పలమనేరు మండలం లోని కొలమాసనపల్లి పంచాయతీ దొడ్డిపల్లి ఎస్టి కాలనీలో రోప్స్ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనుల అభివృద్ధి దిశగా ఉచిత వస్తు పంపిణీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, ద్రావిడ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య దొరస్వామి నాయుడు, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్ పాల్గొని గిరిజనులకు సోలార్ లైట్లు, డ్రై రేషన్ ప్యాకెట్లు, సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. మొత్తం 8 గిరిజన గ్రామాలకు ఈ పంపిణీ నిర్వహించారు. వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో రోప్స్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి రోప్స్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం. గిరిజనులకు గృహ నిర్మాణం, రహదారులు, విద్యుత్, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.


బైరెడ్డిపల్లిలో

ద్రావిడ విశ్వ విద్యాలయం వీసీ ఆచార్య దొరస్వామి నాయుడు మాట్లా డుతూ గిరిజనులు విద్యా పరంగా ఎదగాలని, బాగా చదివి మంచి ఉద్యోగాలు సాధిం చాలన్నారు. విద్యా విభాగంలో రోప్స్ సంస్థతో కలిసి విశ్వవిద్యాలయం కూడా చేయికలిపి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. రోప్స్ సంస్థ చైర్మన్ డాక్టర్ ధనశేఖరన్ సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రోప్స్ మేనేజర్ డాక్టర్ పౌలురాజ్, పలమనేరు ఎస్ఐ లోకేష్ రెడ్డి, రామకుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు మండలాల పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ అధికారులు, పలమనేరు మండల టిడిపి నాయకులు నాగరాజు రెడ్డి, గణేష్, ధనుంజయ రెడ్డి, వెంకటరత్నం, సెల్వరాజ్, గిరిబాబు అమర్నాథ్ రెడ్డి గిరిబాబు అమర్నాథ్ రెడ్డి, మంజులమ్మ, మంజులమ్మ పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు రోప్స్ సంస్థ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

చర్యలు తీసుకునే వరకు పోరాటం

ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ రాజు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కింది స్థాయి ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు కులం పేరుతో దూషించిన కమర్షియల్ టాక్స్ జాయింటు కమిషనర్ రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ హెచ్చరించారు. మంగళవారం చిత్తూరు కట్టమంచి వద్ద ఉన్న కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు కమర్షియల్ టాక్స్ జాయింటు కమిషనర్ తీరును ఉద్యోగ సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంలో కమర్షియల్ టాక్స్ అత్యంత కీలకమైందని జీఎస్టీ తగ్గింపు కార్యక్రమాల్లో కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగులు కీలకంగా పని చేస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు కమర్షియల్ టాక్స్ జాయింటు కమిషనర్ కార్యాలయంలో చోటు చేసుకున్న సంఘటనపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విచారణకు ఆదేశించినప్పటికీ నేటి వరకు ఎలాంటి విచారణ చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఈనెల 21వ తేదీ లోపు కమర్షియల్ ట్యాక్స్ జాయింటు కమిషనర్ ఉద్యోగులపై వేధింపులను సమగ్రంగా విచారించి అతనిపై సస్పెన్షన్ విధించేవరకు తమ పోరాటం కొనసా గుతుం దన్నారు. న్యాయం జరగకుంటే కమర్షియల్ టాక్స్ శాఖలో జరుగుతున్న అవినీతిని బయటపెడతామని హెచ్చ రించారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సంఘం నాయకు లు శివయ్య, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయ కులు సుబ్రహ్మణ్యం లతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

పొంచి వున్న ప్రమాదం!

- నడిరోడ్డుపై విరిగిన, కుంగిన కల్వర్టులు
- స్పందించని అధికారులు


ప్రమాదకరంగా మారిన కుంగిన కల్వర్టు

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు నుండి దండపల్లి మీదుగా నిడి గుంట శంకరయ్యపేట గుండిగల్లు వెళ్లే రహదారిలో కల్వర్టులు ప్రమాదకర స్థితిలో వున్నాయి. రహదారి మధ్యలో కుంగి పోవడంతో ఈ రహదారిలో ప్రయాణించే ద్విచక్ర వాహనాలు, ఆటోలు మార్కెట్‌కు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని వాహనదారులు అంటున్నారు. ఈ రహదారిలోని పెద్దేరు కల్వర్టు, నడిగుంట సమీపంలోని మాలకుంట సమీపంలో, శంకర్ రాయల్ పేట సమీపంలో కల్వర్టులు పూర్తిగా పాడై పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారి వెంబడి కళాశాలలు, పాఠశాలల వాహనాలు సైతం అధిక సంఖ్యలో వెళుతుంటాయి. ఈ ప్రాంతాలలో ఇరుకు రోడ్డు కారణం గా ఎదురుగా వాహనం వస్తే ఆ వాహనం వెళ్లే దాక ఆగాల్సిన దుస్థితి ఏర్పడింది. కుంగిపోయిన కల్వర్టుపై రాత్రి వేళల్లో కనిపించకపోవడంతో చాలామంది ద్విచక్ర వాహనదారులు బోల్తాపడి గాయాపల పాలవడం సర్వ సాధారణంగా మారిందని వాహన చోదకులు పేర్కొం టున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ కల్వర్టు లకు మరమ్మతులు చేయించాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నటరాజన్ మొదలి




ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంగాధర నెల్లూరు మండలం మహదేవమంగళం గ్రామానికి చెందిన ఎస్ఎస్ నటరాజన్ మొదలి నియమితులయ్యారు. ఈయన గతంలో హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా , టిడిపి బూత్ కమిటీ కన్వీనర్‌గా, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మెంబర్‌గా, మండల టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడిగా , జిల్లా టిడిపి బీసీ సెల్ కార్యదర్శిగాను, టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జిగా పార్టీ పదవుల్లో కొనసాగారు. 30 ఏళ్ల పాటు టీడీపీలో కొనసాగుతున్న నటరాజన్ మొదలి పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఆయన కు మొదటి విడత మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ నామినేటెడ్ పదవిని కేటాయించారు. తనను నామినేటెడ్ పదవికి ఎంపిక చేసిన ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్, టిడిపి జెడి నెల్లూరు మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్, మండలంలోని వివిధ స్థాయిలోని టిడిపి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి కార్యవర్గాల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : టిడిపిలో నూతనంగా పదవులు పొందిన వారంతా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ.. ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు , ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని చిత్తూర్ అర్బన్, గుడిపాల, చిత్తూరు రూరల్ మండల, క్లస్టర్, టౌన్, యూనిట్, అనుబంధ సంఘాల కార్యవర్గాల ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నియమించబడిన సభ్యుల చేతుల మీదుగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తామని, పార్టీ అభ్యున్నతి కోసం పని చేస్తామని ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ.. టిడిపి క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, బడుగు బలహీన వర్గాలు, మహిళల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు , యువ నేత నారా లోకేష్ పార్టీని ముందుకు నడిపిస్తున్నారని, వారి ఆశయాలకు అను గుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ టిడిపి అధ్యక్షుడు సీఆర్ రాజన్, శాప్ చైర్మన్ రవి నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు సునీల్ కుమార్, మేయర్ ఎస్ అముద, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజులు, చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ వెంకటేష్, గుడిపాల మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బానాయుడు, సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ తగదు: వైసిపి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ తగదని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని తూగుండ్రం పంచాయతీ తొప్పనపల్లిలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణకు కృపా లక్ష్మీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన, వందలాదిగా తరలివచ్చిన ప్రజలు పేద వైద్య విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం పై పోరాటం చేయ డానికి తాను ఎప్పుడూ సిద్ధమే నన్నా రు. ఈ కార్యక్రమం లో మండ ల వైసిపి అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఎంపీపీ అనిత, మాజీ వైసీపీ కన్వీనర్ సురేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ శ్రీబాబు, ఎంపిటిసి వాణిశ్రీ కేశవులు, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు చిట్టిబాబు మొదలి, వైసిపి నాయకులు ముని రాజారెడ్డి పాల్గొన్నారు.



గృహ నిర్మాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రొంపిచెర్ల : ప్రభుత్వం అందజేసే గృహ నిర్మాణాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ డీఈ ఓ యోగమూర్తి నాయుడు మంగళవారం తెలిపారు. 2025-26 సంవత్సరాలకు గ్రామీణ ఇల్లు కట్టుకునే లబ్ధిదారులు సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గర సంబంధిత ధ్రువపత్రాలు ఇవ్వాలని అన్నారు. స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనే లబ్ధిదారులు అర్హులని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు భార్యా భర్త ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్సులను సంబంధిత ఇంజనీరింగ్ అసిస్టెంట్ కు అందజేయాలని సూచించారు. నేడు రొంపిచెర్ల హౌసింగ్ లేఅవుట్ నందు సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలు పరిష్కరించాలి

వాటర్ ట్యాంక్ లను శుభ్రపరచాలి: ఎంపిపి

ప్రజాశక్తి - రొంపిచెర్ల : రొంపిచెర్ల మండలంలో పార్టీలకతీతంగా అన్ని శాఖల అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. దీనికి తాగునీటి ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ ద్వారా రైతులకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేయాలని కోరారు. అర్హులైన వారికి పెన్షన్ లు మంజూరు చేయాలని కోరారు. పార్టీలకు అతీతంగా పెన్షన్లు మంజూరు చేసేందుకు కృషి చేయాలని కోరారు. మండల వ్యవసాయ శాఖా అధికారిణి శ్రావణి వ్యవసాయ శాఖ ద్వారా వేరుశనగ పంట సాగు చేసే రైతులకు జిప్సం అందుబాటులో ఉందన్నారు. 50 కేజీల బస్తా రూ.177 తో ఇస్తామన్నారు. ఒక్కో ఎకరాకు ఒక్కో రైతుకు 4 బస్తాల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వరి పొలం లో జింక్ సల్ఫేట్ ప్రతి రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉందన్నారు. 4 క్లస్టర్లలో యూరియా ఉందని రైతులు కొనుగోలు చేసి వినియోగించుకో వాలన్నారు. పశువైద్యాధికారిణి ఉషరాణి మాట్లాడుతూ 6130 పశువులకు గాలికుంటూ వ్యాధి టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సహకార సంఘం చైర్మన్ రఘునాథ రెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, సీడీపీఓ వాణిశ్రీ దేవి, ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ వినయ్, ఏపీవో బాలమురళి, ఇరిగేషన్ ఏఈ ముని శేఖర్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఆటో బోల్తా

వ్యక్తి మృతి, పలువురికి గాయాలు

ప్రజాశక్తి -విజయపురం (నింద్ర): ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి చెందగా, పలువురు గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నాగలాపురం మండలం నందనం గ్రామానికి చెందిన ఆది ఆంధ్ర వాసులు దేశమ్మగుడికి బయలుదేరి అమ్మవారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో నేత్తేరి క్రాస్ నింద్ర మండలం వద్ద ఏపీ 03 టిఇ 8532 ఆటో అనే నెంబరు కల ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మణేంద్ర (55)అక్కడికక్కడే మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. స్థానికులు వారిని గమనించి 108 సాయంతో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందిస్తున్నారు. అందులో ముగ్గురు స్త్రీలు, ఇద్దరు పురుషులు, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. వీరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

జూడో క్లస్టర్‌లో జిల్లా పోలీసులకు కాంస్యం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో చిత్తూరు జిల్లా పోలీస్ సిబ్బందికి కాంస్య పతకం సాధించడంతో ఎస్‌పి తుషార్ డూడి అభినందించారు. జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచిన కానిస్టేబుల్ (పిసి 3642) ఎం షంషీర్ జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచారు. జమ్ము కాశ్మీర్ లోని శ్రీనగర్ నగరంలో అక్టోబర్ 8 నుండి 16 వరకు నిర్వహించిన 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025 క్రీడా పోటీలలో పెంచక్ సిలాట్ విభాగంలో 60 కిలోల కేటగిరీలో పాల్గొని మూడవ స్థానం సాధించి కాంస్య పతకం గెలుచుకున్నారు.

చెరువుల వేలం షెడ్యూల్ విడుదల


మాట్లాడుతున్న ఎంపిడివో చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల పరిధిలో మూడు పంచాయతీలలో చెరువుల వేలం (చెరువుల వేలంపాట) నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వారు విలేకరు లతో మాట్లాడుతూ మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలో ఉన్న 26 చెరువుల వేలంపాట నేడు (మంగళవారం) ఉదయం 10 గంటలకు, ధర్మపురి పంచాయతీ పరిధిలోని 7 చెరువుల వేలం పాట బుధవారం మధ్యాహ్నం 2గంటలకు, కమ్మనపల్లి పంచాయతీ పరిధిలోని 7 చెరువుల వేలంపాట గురువారం మధ్యాహ్నం2గంటలకు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. తమ తమ పంచాయతీల పరిధిలో ఉన్న చెరువుల వేలం పాటలో పాల్గొనాలనుకుని ఆసక్తి గల వ్యక్తులు గ్రామ సచివాలయాలను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ వేలంపాట ప్రక్రియ పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో

వీధి కుక్కలకు ఆహారం నిషేధం: కమిషనర్

ప్రజాశక్తి -పలమనేరు: వీధి కుక్కలకు బహిరంగ ప్రదేశాల్లో నిషేధమని కమిషనర్ ఎన్‌విరమణారెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశానుసారం జంతువుల జనన నియంత్రణ, వీధి కుక్కలు, పశువుల నిర్వహణపై ఇచ్చిన ఆదేశానుసారం పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని వీధి కుక్కల నియంత్రణపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాటికి సంతాన నిరోధక వ్యాక్సిన్‌లు వేయిస్తామని, చిత్తూరు నగరపాలక సంస్థలో వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. పురపాలక సంఘ జంతు ప్రేమికులను ఉద్దేశించి వీది కుక్కలను ఆహారం అందించడంలో ఆహార విషయమై తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పలమనేరు పురపాలక సంఘ పరిధిలో అన్ని ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు తదితర బహిరంగ ప్రదేశాల్లో వీధికుక్కలు రానివ్వకుండా సంబంధిత యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పలమనేరు పురపాలక సంఘ కార్యాలయంలో ఈ విషయమై కంట్రోల్ రూమ్ నెంబరు 7337388215 ను ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు.

కౌశల్ పరీక్షల్లో జిల్లాస్థాయికి

ఆణిగానూరు విద్యార్థులు



ప్రజాశక్తి - రామకుప్పం : మండల పరిధిలోని ఆణిగానూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కౌశల్ పరీక్షల్లో జిల్లా స్థాయికి ఎంపికై నట్లు మంగళవారం ప్రధానోపా ధ్యాయుడు పి ఆడిశేషయ్య ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల లో పదవతరగతి చదువుతున్న కార్తిక్, తొమ్మిదవ తరగతి చదువుతున్న నవీన, ఉదయశ్రీ, లు ఈ నెల 27,28 తేదీలలో నిర్వహించబడే జిల్లా స్థాయి కౌశల్ పరీక్షలకు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థులను మాజీ రెస్కో డైరెక్టర్, మాజీ సర్పంచ్ ఆర్ కె రామమూర్తి, ఎస్ ఎం సి చైర్మన్ బీరప్ప, శుభాష్ ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రామకుప్పం: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని కుప్పం కో ఇన్‌చార్జి వెంకటేష్ మాదిగ మంగళవారం కోరారు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ పై దాడి చేస్తే న్యాయస్థానంలోనే ఉన్న పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సరికాదన్నారు. ఈ సందర్భంగా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దళితుల ఆత్మగౌరవం నిలబెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17 వతేదీ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాలో దళితులు బడుగు, బలహీన వర్గాల మేధావులు, అంబేద్కర్ వాదులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద, జయప్ప, ఎంఎస్‌పి మైనార్టీ అధ్యక్షులు నాసిర్ బాష, రియాజ్, అహ్మద్, మహమ్మద్ బాష, ఇస్మాయిల్ బాష, ముజ్జు, శంకర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రెండు పంచాయతీలుగా నవియాల తండా

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని ననియాలతండా గ్రామ పంచాయతీని రెండుగా విభజించే ప్రక్రియను 15రోజుల్లోపు పూర్తిచేయాలని కలెక్టరు సుమిత్ కుమార్ జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశించారు. రామాపురం తండా వాసులు తెలిపిన వివరాల మేరకు ననియాలతండా, రామాపురం తండాలను కలిపి 2019లో రాష్ట్ర ప్రభుత్వం ననియాలతండా పంచాయతీని ఏర్పాటు చేసింది. రెండు గ్రామాల మధ్య సుమారు 8 కిలోమీటర్ల దూరం ఉండటంతో రామాపురం తండా వాసులు ప్రభుత్వ నిర్ణయం పై హైకోర్టును ఆశ్రయించారు. దీంతో 2020లో ఈ పంచాయతీ ఎన్నికలు కూడా జరగలేదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టులో హైకోర్టు తీర్పును వెలువరించింది. ననియాల తండా, రామాపురం తండాలను వేర్వేరు పంచాయతీలుగా ఏర్పాటు చే యాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్, కలెక్టరు, జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల అమలులో జాప్యం జరుగుతుండటంతో గ్రామస్థులు సోమవారం పీజీఆర్ఎస్ కు హాజరై కలెక్టరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించి కలెక్టరు 15రోజుల్లోకి ననియాలతండా, రామపురం తండాల ను వేర్వేరు పంచాయతీలుగా విభజించే ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.